క్లుప్తంగా

ఉపాధ్యాయుడి గైర్హాజరుపై నోటీసు జారీ

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పెదపూడి మండలం వేండ్ర ఎంపీపీఎస్ స్కూల్ ఎస్జీటీ ఎస్వీవీ సత్యనారాయణ 2023 ఆగస్టు 19 నుంచి విధులకు గైర్హాజరుకావడంపై రెండురోజుల్లో సమాధానం తెలియజేయాలంటూ డీఈఓ పిల్లి రమేష్ నోటీసు జారీ చేశారు. దీనిపై స్పందించకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధుల నుంచి తొలగిస్తామని, సదరు ఉపాధ్యాయుడు వ్యక్తిగతంగా హాజరై రాతపూర్వక సంజాయిషీ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

ల్యాప్‌టాప్‌ల అందజేత



కలెక్టర్ షణ్మోహన్‌కు 10 ల్యాప్‌టాప్‌లను అందజేస్తున్న జీఎం రమేష్

కాకినాడ సిటీ: కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కార్యాచరణలో భాగంగా ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మాంబట్టు జనరల్ మేనేజర్ జి.రమేష్ కలెక్టర్ షణ్మోహన్‌ను కలిసి 10 ల్యాప్‌టాప్‌లను అందజేశారు. గతేడాది ఐదు ఆర్వో ప్లాంట్లను కలెక్టర్ చేతుల మీదుగా పిఠాపురం నియోజకవర్గంలో పీహెచ్‌సీల్లో ప్రారంభించామని రమేష్ వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇండస్ కాఫీ కంపెనీ సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె. లచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

కరప: గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎం.అనుపమ పేర్కొన్నారు. మండలం జెడ్.భావారంలో శనివారం ఆమె పర్యటించి, పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. పారిశుధ్య కార్మికులు ఇంటింటికీ వెళ్లి తడి, పొడిచెత్త వేర్వేరుగా సేకరించి, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ అనుపమ గ్రామస్తులను కలిసి పారిశుధ్య కార్మికులు చెత్తసేకరణకు ప్రతిరోజూ ఇంటింటికీ వస్తున్నదీ, లేనిదీ అడిగి తెలుసుకున్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎస్వీ శ్రీనివాసరావు కరపలో పర్యటించి, పారిశుధ్య పనులను తనిఖీచేసి, సిబ్బందికి పలుసూచనలిచ్చారు.

అసంపూర్తి డీఐసీ భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో జిల్లా పరిశ్రమల కేంద్రం కోసం సుమారు రూ.3కోట్ల నిధులతో గతంలో నిర్మాణం ప్రారంభించి అర్ధాంతరంగా నిలిపివేయడంతో అసంపూర్తిగా ఉన్న భవనాన్ని కలెక్టరు షణ్మోహన్ శనివారం పరిశీలించారు. జిల్లా పరిశ్రమలు, ఏపీఐఐసీ అధికారులతో కలిసి ఆయన అసంపూర్తి భవన ప్రస్తుత స్థితిని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బిల్లుల పెండింగ్ కారణంగా కాంట్రాక్టరు పనులు నిలిపివేసి కోర్టును ఆశ్రయించారని అధికారులు తెలిపారు. పనులు పూర్తి చేసేందుకు త్వరలో నిర్ణయం తీసుకుంటామని కలెక్టరు అన్నారు. సమీపంలోని సెట్రాజ్ కార్యాలయం, ఏపీఐఐసీ జోనల్ మేనేజరు కార్యాలయాన్ని కలెక్టరు పరిశీలించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం గణపతి, ఏపీకైఐసీ జోనల్‌మేనేజరు రమణారెడ్డి, సెట్రాజ్ సీఈఓ కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

బోట్‌క్లబ్: స్థానిక జిల్లా ఉద్యాన కార్యాలయంలో శనివారం సమాచార హక్కు చట్టంపై ఉద్యోగులకు జిల్లా ఇన్‌చార్జ్ ఉద్యానశాఖాధికారి జి.విజయలక్ష్మి అవగాహన కల్పించారు. సమాచార హక్కు చట్టం ప్రజలకు, రైతులకు వజ్రాయుధం వంటిదన్నారు. సమాచార హక్కు చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. సమాచారం అందివ్వడంలో ఏ స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం చేసినా ఇబ్బందులు తప్పవన్నారు.

జాతీయస్థాయిలో రంగరాయ విద్యార్థుల ప్రతిభ



విజేతలుగా నిలిచిన కాకినాడ ఆర్ఎంసీ విద్యార్థులు బెహరా యర్రంరాజు, ఉప్పాడ జోష్న, అపూర్వ శుక్ల

కాకినాడ క్రైం: రంగరాయ వైద్య కళాశాల కీర్తిని విద్యార్థులు జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారు. తాజాగా ముగ్గురు ఎంబీబీఎస్ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ప్రివెంటివ్ అండ్ సోషల్ మెడిసిన్ (ఐఏపీఎస్ఎం)-2025 పోటీలో ప్రతిభచూపారని కళాశాల యాజమాన్యం శనివారం తెలిపింది. ఫైనల్ ఇయర్ పార్టు-1 విద్యార్థులు అపూర్వ శుక్ల, బెహరా యర్రంరాజు, ఉప్పాడ జోష్న ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఐదవ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించారన్నారు. విద్యార్థులతో పాటు వారికి మార్గనిర్దేశాన్నిచ్చిన ఎస్‌పీఎం హెచ్‌ఓడీ డాక్టర్ సుజాత, నోడల్ అధికారి డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ తిరుమలరావును ఆర్ఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అభినందించారు.

అధ్వాన రహదారులతో అవస్థలు

- ఎమ్మెల్యే సారూ.. ఛిద్రమైన రోడ్లను పట్టించుకోండి!
- గోతులమయమైన కాకినాడ-రామచంద్రపురం, రావులపాలెం రోడ్లు
- ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్న వాహనచోదకులు



కాకినాడ-రామచంద్రపురం రహదారిలో నడకుదురు బ్యాంక్‌వద్ద ఏర్పడిన గోతులు

కరప: కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అధ్వానంగా మారిన రహదారులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. కాకినాడ-రామచంద్రపురం రోడ్డులో అడుగడుగునా గోతులు పడటంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పేరుకే ప్రధాన రహదారి, ఈ దారిలో ప్రయాణం ప్రమాదభరితంగా మారిందని ద్విచక్ర వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతుకులమయమైన రోడ్లపై ప్రయాణం చేయాలంటే నరకయాతన పడుతున్నామన్నా పాలకులు పట్టించుకోవడం లేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ-రావులపాలెం రోడ్డు ఛిద్రం

రావులపాలెం, జొన్నాడ జాతీయరహదారికి అనుసంధానం చేసే కాకినాడ-రావులపాలెం రోడ్డు మరీ దారుణంగా తయారైంది. గోతులు పూడ్చించామన్న కూటమి నాయకులు ప్రగల్భాలు మూణ్ణాళ్ల ముచ్చటగా తయారైందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ప్రతిపక్షంగా ఉన్నప్పుడు కూటమి నేతలు రహదారుల్లో చిన్నగొయ్యి పడినా రాద్ధాంతం చేసేవారని, అధికారంలోకి వచ్చాక ధ్వంసమైన రహదారులు, రోడ్లలోని గోతులు వారికి కనిపించడం లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నిత్యం వాహనాల రద్దీ

జిల్లా కేంద్రాన్ని కలిపే కాకినాడ-రామచంద్రపురం రోడ్డు, కాకినాడ-కోటిపల్లి రహదారి ప్రయాణికులు, వాహనచోదకుల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటుంది. వైద్యంకోసం కాకినాడలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు, కలెక్టరేట్, కోర్టులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, కోర్టులకు, వ్యాపార కార్యకలాపాలకు కాకినాడ పరిసర మండలాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఉన్నత చదువుల కోసం విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రహదారి ధ్వంసమవ్వడంతో 2023లో మాజీ మంత్రి కురసాల కన్నబాబు కాకినాడ నుంచి నడకదురు, పెనుగుదురు మీదుగా ద్రాక్షారామ వరకు, పెనుగుదురు నుంచి కరప, వేళంగి మీదుగా రామచంద్రపురం వరకు ప్రధాన రహదారిని ఆధునీకరించారు. తర్వాత వర్షాకాలంలో కురిసిన వర్షాలకు నడకదురు, పెనుగుదురు, కరప, వలసపాకల, వేములవాడ, పెదకొత్తూరు గ్రామాల మధ్య కాకినాడ-రామచంద్రపురం రోడ్డు గోతులు పడ్డాయి. వాహనచోదకులు గోతుల్లోపడి అదుపుతప్పి కిందపడిపోయి గాయాలపాలవుతున్నారు. రాత్రి సమయంలో గోతులు కనబడక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి.



నడకుదురు వృద్ధాశ్రమం వద్ద ఛిద్రమైన రోడ్డు



పెనుగుదురు వంతెన సమీపంలో పడిన గొయ్యి



కరప, వలసపాకల గ్రామాల మధ్య ధ్వంసమైన రహదారి

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు హడావుడి

కాకినాడ-రామచంద్రపురం రహదారిలో గోతులుపడ్డాయి. అప్పుడు ప్రతిపక్షంగా ఉన్న జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జ్ నాయకుడు, ప్రస్తుత ఎమ్మెల్యే పంతం నానాజీ స్థానిక నాయకులతో కలసి హడావిడి చేసి, గోతుల్లో మట్టి వేసి, ప్రభుత్వం చేయలేని పని చేశామని ప్రకటించేవారు. అధికారంలోకి వచ్చాక కాకినాడ-రామచంద్రపురం రోడ్డులోని గోతులు ఆయనకు కనబడటంలేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఎమ్మెల్యే నానాజీ స్పందించి గోతులు పూడ్చించి, ప్రమాదాలు జరగకుండా చూడాలని మండలవాసులు కోరుకుంటున్నారు.

> **రహదారి పొడవునా గోతులతో ఇబ్బందులు**
>
> 
>
> కాకినాడ-రావులపాలెం ప్రధాన రహదారిలో నడకుదురు, పెనుగుదురు, కరప తదితర గ్రామాల మధ్య అడుగడుగునా గోతులుపడటంతో ప్రయాణానికి నరకయాతన పడుతున్నాం. రాత్రి సమయంలో గోతుల్లో పడి ద్విచక్రవాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. అధికారులు స్పందించి గోతులు పూడ్చించేందుకు చర్యలు తీసుకోవాలి.
>
> – చింతా బుజ్జి, పెదకొత్తూరు

ఆర్‌అండ్‌బీ ఏఈఈ వివరణ

కాకినాడ-రామచంద్రపురం రోడ్డు పొడవునా నడకుదురు, పెనుగుదురు, కరప, వలసపాకల తదితర గ్రామాల వద్ద ఏర్పడిన గోతులు, వాహనచోదకులు పడుతున్న ఇబ్బందులపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ కె.సాయిబాబారెడ్డిని వివరణ కోరగా వర్షాలకు రహదారిలో గోతులుపడ్డాయన్నారు. గతంలో గోతులు పూడ్చించిన కాంట్రాక్టర్‌తో సంప్రదించామని, త్వరలోనే గోతులు పూడ్చించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు.

ఐటీఐల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం



ఐటీఐ ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మతో సమావేశమైన ఐటీఐ ఆర్‌డీ శ్రీనివాసరావు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): దేశంలోని ఐటీఐల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని ఏపీ తెలంగాణ రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడ ఐటీఐ కళాశాలను శనివారం సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఐటీఐలను అభివృద్ధి పరిచే క్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం రూ.66వేల కోట్లు కేటాయించారని, మొదటి విడతలో ఏపీలో తిరుపతి, వైజాగ్ ఐటీఐలను ఎంపిక చేశారన్నారు. ఆధునిక యంత్ర పరికరాలతో పాటు కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నామని, ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలతో పాటు అప్రెంటీస్ కల్పించడానికి పరిశ్రమలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్టు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాలవర్మతో సమావేశమయ్యారు.

విద్యుత్ చార్జీల పేరుతో ప్రభుత్వం దోపిడీ



కరపత్రాలతో ప్రచారం నిర్వహిస్తున్న ప్రగతిశీల మహిళా సంఘ సభ్యులు

కాకినాడ సిటీ: స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని ప్రభుత్వం రద్దు చేయాలని, విద్యుత్ చార్జీల నిల్వ దోపిడీని ఆపాలని ప్రగతిశీల మహిళా సంఘం (స్త్రీవిముక్తి) నాయకురాలు రెడ్డి దుర్గాదేవి డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 5న మండల, డివిజన్, జిల్లా కేంద్రాల్లో విద్యుత్ కేంద్రాల వద్ద ధర్నాలు నిర్వహిస్తామని ఆమె తెలిపారు. శనివారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యనారాయణపురం ప్రాంతంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేసి విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. మాట తప్పడం చంద్రబాబునాయుడికి పరిపాటిగా మారిందన్నారు. విద్యుత్ ఛార్జీల బాదుడు ఉండదని చెప్పిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తరువాత చార్జీల బాదుడు మొదలెట్టారని అన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేసి ప్రజలపై భారం మోపే విధంగా కూటమి ప్రభుత్వ విధానాలు ఉన్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు గంటా సత్యవతి, అగ్రవరపు అప్పల నరసమ్మ, నాగల సరస్వతి, కేతా లక్ష్మి పాల్గొన్నారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళులు



రమణయ్యపేటలో జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ రూరల్: జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య తెలుగు నేల ముద్దుబిడ్డ శాస్త్రవేత్త కె.జగన్నాథశర్మ పేర్కొన్నారు. పింగళి వెంకయ్య జయంతిని రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పింగళి చిత్రపటానికి జగన్నాథశర్మ, అడబాల రత్నప్రసాద్, జి.కృష్ణమోహన్, డాక్టరు శిరీష, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, సత్యనారాయణ చౌదరి, తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగన్నాథశర్మ మాట్లాడుతూ పింగళి వెంకయ్య మూడు గంటల వ్యవధిలో జాతీయ పతాకాన్ని రూపొందించి, మహాత్మా గాంధీకి అందజేశారన్నారు.

రేషన్ డీలర్ల ఘర్షణపై విచారణ

కాకినాడ రూరల్: వాకలపూడి గ్రామంలో రేషన్ డీలర్ల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ ఘటనపై సర్పవరం పోలీసులకు ఫిర్యాదులు అందడంతో ఇరువర్గాలపై శనివారం కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రేషన్ షాపు విషయమై శుక్రవారం సంతోష్‌నగర్ వద్ద షాపు వద్ద డీలర్ పిల్లి కిరణ్‌కుమార్ ఇన్‌చార్జి డీలర్, మండల రేషన్ డీలర్ల అధ్యక్షుడు సూరంపూడి కిశోర్‌కుమార్ మధ్య వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దిగారు. తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని పిల్లి కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కిశోర్‌కుమార్‌పై సర్పవరం పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. డీలర్ల సంఘ నేత కిశోర్‌కుమార్ ఫిర్యాదు మేరకు పిల్లి కిరణ్‌కుమార్‌తోపాటు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. సీఐ పెద్దిరాజు ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. శనివారం సాయంత్రం గొడవ జరిగిన వాకలపూడి సంతోష్‌నగర్ వద్ద రేషన్ దుకాణాన్ని పరిశీలించిన డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, స్థానికులు నుంచి వివరాలు సేకరించారు.

పెట్టుబడి సాయంగా జిల్లాకు రూ.101 కోట్లు



కరప సమావేశంలో మాట్లాడుతున్న జేడీఏ డాక్టర్ విజయ్‌కుమార్

కరప: జిల్లాలోని రైతులకు పెట్టుబడి సాయంగా మొదటి విడతలో రూ.101 కోట్లు మంజూరయ్యాయని, వాటిని రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిసాయంగా మొదటి విడతగా రూ.5 వేలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ నిధులు రూ.2 వేలతో కలిపి రూ.7 వేలు జమ చేస్తామన్నారు. అక్టోబరులో రెండో విడతగా రూ.7 వేలు, డిసెంబరులో మూడో విడతగా రూ.6 వేలు వంతున రైతుల అకౌంట్లలోకి జమ అవుతాయన్నారు. పెట్టుబడి సాయం అందని రైతులు గ్రీవెన్స్ ద్వారా ఫిర్యాదులు చేయాలని జేడీఏ వివరించారు. ఈ సందర్భంగా జేడీఏ విజయ్‌కుమార్ నియోజవర్గానికి మంజూరైన పెట్టుబడి సాయం రూ.6.87 లక్షల చెక్‌ను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే నానాజీకి అందజేశారు. మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, కరప, కాకినాడ ఏడీఏలు కె.బాబూరావు, కె.దుర్గాలక్ష్మి, ఎంపీఓ ఇమ్మిడిశెట్టి సత్య, తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, ఎంపీడీఓ ఎం.అనుపమ, నీటిసంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి



షేక్ అబ్దుల్ కరీమ్ సాహెబ్ (బాషా)

కాకినాడ రూరల్: మైనారిటీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులైన షేక్ అబ్దుల్ కరీమ్ సాహెబ్ (బాషా) అన్నారు. తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి, రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కురసాల కన్నబాబుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. రూరల్ మండలం వాకలపూడికి గ్రామానికి చెందిన బాషా వైఎస్సార్ సీపీలో మైనారిటీ విభాగంలో జిల్లా సెక్రటరీతోపాటు పలు పదవులు చేపట్టారు, వక్ఫ్ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. ఈ సందర్భంగా పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో ఆర్డినేటరు బొత్స సత్యనారాయణ, జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, సిటీ ఇన్‌చార్జి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఖదర్ భాషా తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం

కాకినాడ రూరల్: తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ మండలంలోని వలసపాకలలో అంగన్‌వాడీ సెంటరు 180 పరిధిలో శనివారం ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ కాకినాడ రూరల్ ప్రాజెక్ట్, అదాని ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా క్విజ్ పోటీ, వంటకాల ప్రదర్శన నిర్వహించారు. అదాని ఫౌండేషన్ ఫార్చ్యూన్ సుపోషణ్ ప్రాజెక్ట్ అధికారి జనార్దన్ వివరించారు.

శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు నూతన కమిటీ



నూతనంగా ఎన్నికైన శాంతినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

బోట్‌క్లబ్: శాంతినగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు స్థానిక మహిళా మండలి భవనంలో శనివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా గొడవర్తి సత్యమూర్తి వ్యవహరించారు. అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి సతీష్, కార్యదర్శిగా సిద్ధా సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడిగా మార్ని జానకిరామ చౌదరి, కోశాధికారిగా దేగల వీరభద్రరావు, సహాయ కార్యదర్శిగా రావు సూర్యారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కొమ్మిరెడ్డి శ్రీరామ నరసింగరావు, బీఎల్ నారాయణరావు, జి.రాంబాబు, పైడా వెంకటనారాయణ, వి.సుబ్రహ్మణ్యం (వెల్లబ్బు), జి.సత్యమూర్తి, ఈహెచ్‌ఎస్ మోహన్, జి.సత్యనారాయణ (నానాజీ), రామచంద్రమూర్తి, పోలిశెట్టి అనిల్‌కుమార్ ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు పెద్దిరెడ్డి సతీష్ మాట్లాడుతూ కాలనీ పారిశుధ్య నిర్వహణ, వీధిలైట్లు, పార్కు అభివృద్ధిపై దృష్టిపెట్టి మెరుగైన సేవలను అందిస్తామన్నారు. నూతన కార్యవర్గానికి కాలనీ ప్రజలు అభినందనలు తెలియజేశారు.

5న ఏపీటీలో స్పాట్ అడ్మిషన్లు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఆంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్లకు ఈ నెల 5న స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.జనార్దనరావు శనివారం తెలిపారు. డిప్లమో మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఆర్కిటెక్చర్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ కళాశాలలో సీట్లకు అడ్మిషన్లు కల్పిస్తామని, ఆసక్తి గలవారు దరఖాస్తు 4వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలని సూచించారు. కౌన్సెలింగ్ ఫీజు ఓసీ, బీసీలు రూ.1100, ఎస్సీ,ఎస్టీలు రూ.350 చెల్లించాలని తెలిపారు. అడ్మిషన్ పొందిన విద్యార్థులు రూ.4,700 కళాశాల ఫీజు చెల్లించాలన్నారు.

అధ్యాపకులు బోధనశైలిని అభివృద్ధి చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందుకున్న అధ్యాపకులు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): అధ్యాపకులు నిరంతర విద్యార్థిలా బోధనశైలిని అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యార్థుల్లో ఆచరణాత్మక ఆలోచన, పరిశోధనా దృక్పథం పెంపొందించవచ్చని ఎన్ఐఈఏపీ ప్రొఫెసర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ, ఎన్ఐటీ వరంగల్ సంయుక్తంగా ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన విద్యావిధానం ప్రకారం అధ్యాపకులు సిలబస్ రూపకల్పనలో తగిన మార్పులు చేసుకోవాలన్నారు.ఇంజనీరింగ్ విద్యలో నాణ్యతను పెంచే దిశగా అవుట్‌కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ (ఓబీఈ) కీలక మార్గమని అన్నారు. ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ కో-ఆర్డినేటర్, మాజీ వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ అధ్యాపకులు పరిశోధన, ప్రాజెక్టు ఆధారిత బోధనపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రానిక్స్ ఐసీటీ అకాడమీ జాతీయస్థాయిలో నూతన శిక్షణ మాడ్యూళ్లను రూపొందిస్తూ అధ్యాపకుల సామర్థ్యాలను పెంచే దిశగా కృషి చేస్తుందన్నారు.టెక్నాలజీ ఆధారిత బోధన, యాక్టివ్‌లెర్నింగ్, స్టూడెంట్ ఫీడ్‌బ్యాక్ వంటి అంశాలు నూతన విద్యావిధానంలో కీలకమన్నారు. అనంతరం వర్క్‌షాపులో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేసారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ దీక్షితులు, అధ్యాపకులు లీలాకుమారి, స్వరూపరాణి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

సిమెంట్ బెంచీల వితరణ



కరపలోని దుర్గాదేవి గుడివద్ద ఆటో యూనియన్ నాయకులతో కలసి సిమెంట్ బెంచీని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ తాతీలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు నక్కా బుజ్జి తన తండ్రి నక్కా ధనరాజు (భజన గురువు) జ్ఞాపకార్థం నాలుగు సిమెంట్ బెంచీలు అందజేశారు. కరపలోని పేపకాయలపాలెం రోడ్డులో విజయదుర్గ గుడి వద్ద భక్తులు కూర్చునేందుకు సిమెంట్ బల్లలు కావాలని విజయదుర్గ ఆటో యూనియన్ నాయకులు, పల్లపువీధిలోని గుర్రప్ప చెరువువద్ద కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలని ఆవీధి యూత్ సభ్యులు మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలును కోరారు. మాజీ సర్పంచ్ హైస్కూలు టీచర్ నక్కా బుజ్జి దృష్టికి తీసుకెళ్లగా ఆమె స్పందించి, నాలుగు సిమెంట్ బెంచీలు బహూకరించారు. శనివారం దుర్గాదేవి గుడి వద్ద రెండు, గుర్రప్పచెరువు వద్ద మరో రెండు సిమెంట్ బెంచీలను స్థానికులతో కలసి తాతీలు ఏర్పాటు చేశారు. ఆటో యూనియన్ నాయకులు మేడిశెట్టి రామ్‌బుజ్జి, దేవిశెట్టి బుజ్జి, శ్రీపాదం శ్రీను పాల్గొన్నారు.